# బొమ్మ బొరుసు

"సుందరం! పదిరూపాయలుంటే ఇవ్వవోయ్ ఫస్టుకి ఇచ్చేస్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

అతన్ని సూటిగాచూశాడు సుందరం. జాలి కలిగింది ఎందుకో చవకబారు వెలిసిపోయిన బట్టలు. మాసిన గడ్డం. ఎప్పుడూ దీర్ఘంగా ఆలోచిస్తూ ఏదో కోల్పోయిన వాడిలా జీవితంలో సుఖం తెలీని వాడిలా చ్చ్ చ్చ్ పాపం....అనుకున్నాడు.

ఇద్దరూ ఒకే ఆఫీసు. సుందరం జూనియర్ యల్డీసీ కృష్ణమూర్తి సీనియర్ యూడీసీ సుందరం కంటే ఎక్కువ జీతం వచ్చినా ఏం లాభం? అతనిమీద మో బడిన భారం అతని చుట్టూ ఆశలు అల్లుకుని బ్రతుకుతున్న బంధాలు తెలుసుకుంటే ఎవరికయినా జాలి కలుగుతుంది. తల్లి తండ్రి ఉన్నారు. తండ్రికి పక్షవాతం వచ్చి మంచంలోనే. తమ్ముడు చదువుకుంటున్నాడు పీటికి తోడు పెళ్ళి కావలసిన శారద గుండెల మీద కూర్చుని వుంది. కృష్ణమూర్తికి ఇద్దరు పిల్లలు, వీళ్ళంతా ఒక్కడి సంపాదన తినాలి.

"దారుణం" అనుకున్నాడు సుందరం.

"నాకు పెళ్ళి వద్దని మొత్తుకున్నా నోయ్ సుందరం కాని మా అమ్మా నాన్నా నన్ను బలవంతంచేసి పెళ్ళి చేసుకోకపోతే ఉరి పోసుకుంటామని బెదిరించారు. అప్పుడు భయపడ్డాను. నిజంగా అలా చేస్తారేమో అంతా నన్ను తిడతారేమోనని దీనికంటే అదే నయం అనిపిస్తోంది ఇప్పుడు" తనలో తను గొణుక్కుంటున్నట్లుగా సుందరంతో అంటూవుంటాడు కృష్ణ మూర్తి.

పర్సులో నుంచి పది కాగితం తీసి ఇచ్చాడు సుందరం.

సెంటర్లోకి వచ్చారు ఇద్దరూ.

నైజామ్ స్వీట్ షాపులో స్వీట్స్ కొన్నాడు కృష్ణమూర్తి.

"మా శారదను చూడ్డానికి పెళ్ళివారొస్తున్నారోయ్" అన్నాడు కృష్ణ మూర్తి పేలవంగా నవ్వుతూ,

అదన్నమాట సంగతి. వాళ్ళని మర్యాద చెయ్యడానికి స్వీట్స్

ఎందరికో స్వీట్స్ తినిపించాడు అతను తియ్యటి మిఠాయి తిన్న వాళ్ళెవరూ తియ్యటి మాట అతని చెవిన వెయ్యలేదింతవరకూ.

అన్నీ చేదుమాటలే.

కట్నం. లాంచనాలు!

అతని ఇల్లు దగ్గరికి వస్తుండగా "నువ్వూ రావోయ్, మా ఇంటికి" అన్నాడు కృష్ణమూర్తి,

"అబ్బే నేనెందుకు?" అన్నాడు సుందరం మొగమాటపడుతూ.

"ఫరవాలేదు. రా! కాస్త నాకు తోడుగా వుంటుంది." అన్నాడు.

ఇద్దరూ ఇంటికి వెళ్ళారు,

అప్పటికే అతని భార్య ఏర్పాట్లన్నీ పూర్తిచేసే వుంచింది. పక్కింట్లో నుంచి కుర్చీలు. టీపాయ్, టీ గ్లాసులు అన్నీ రెడీ. శారద మొహో గొలుసు కూడా అరువుదే.

కాసేపటికి పెళ్ళివారొచ్చారు.

గెడకర్రలా వున్నాడు కుర్రాడు. పాతికేళ్ళపైన వుంటాయి మనిషి నలుపు, ముఖంలో కళలేదు. శారద అందం ముందు వెలవెలాపోతున్నాడు అతను, కాకిముక్కుకి దొండపండు సామెత జ్ఞాపకం వచ్చింది సుందరానికి.

పెళ్ళికొడుకు తండ్రి రవణారెడ్డిలా వున్నాడు, తల్లి మాత్రం గుమ్మడి పండులా నిండుగావుంది, మాటలు గూడా నిండుగానే వున్నాయి వాళ్ళతో పాటు ఖద్దరు బట్టలు ధరించిన పెద్ద మనిషి ఆప్యాయంగా స్వీట్స్ నంజు కుంటున్నాడు ఆయన మధ్యవర్తి అట.

మర్యాదలు పూర్తియ్యాక అసలు విషయం ప్రస్తావన కొచ్చింది.

కట్నం కానుకలూ!

నాలుగువేలు కట్నం. వాచీ, వుంగరం సైకిలు. ఆడపడుచుకి ఐదొందలు పెళ్ళి వారి డిమాండ్ అని మధ్యవర్తి సెలవిచ్చాడు.

"వెయ్యినూటపదహార్లు కట్నం. ఆడపడుచుకి నూటపదహార్లు ఇచ్చు కుంటాము, వాచీ, వుంగరాలు ఏదైనా పండుగలొచ్చినప్పుడు సర్దుకుంటాము" అన్నాడు కృష్ణమూర్తి.

వాళ్ళు ఒప్పుకోలేదు.

బేరం కుదర్లేదు.

కథ మామూలే.

* * *

ఒకరోజు కృష్ణమూర్తి తమ్ముడు రొప్పుకుంటూ వచ్చాడు ఆఫీసుకి. ఆదుర్దాగా ఏదో చెప్పాడు కృష్ణమూర్తి హడావుడిగా ఎవరిదో సైకిలు అడిగి తీసుకుని తమ్ముడ్ని ఎక్కించుకుని వెళ్ళిపోయాడు

తర్వాత తెలిసింది అతని చెల్లెలు గన్నేరుపప్పు తిన్నదని.

సుందరం మనస్సు కలుక్కుమంది.

పాపం! పెళ్ళికావడంలేదని ఆ పిల్లకు దిగులు ఇంతదారుణానికి ఒడి కట్టిందంటే ఏదో పెద్దకారణమే వుండివుండాలి. ఎవరైనా ఏదైనా అన్నా రేమో అవమానించారేమో జీవితంపై విరక్తి కలిగిందంటే హృదయానికి దెబ్బతగిలి వుంటుంది.

శారదని హాస్పటల్లో జేర్పించారని తెలిసింది. సుందరం వెళ్ళాడు.

బెడ్‌దగ్గర తల్లి వుంది. కృష్ణమూర్తి ఎక్కడికో వెళ్ళాడట. బ్రతికి బైటపడిందని చెప్పి కన్నీళ్ళు తుడుచుకుంది ఆమె.

శారద కళ్ళెత్తి చూసింది సుందరాన్ని, ఆమె జాలిచూపులు అతని గుండెని కరిగించాయి- ఆడపిల్లలతో అతనికి ఏమాత్రం పరిచయం లేదు- ఎలా పలకరించాలో అసలు తెలీదు.

"ఏం జరిగింది?" అన్నాడు సుందరం-

ఆమె మాట్లాడలేదు- కళ్ళు దించుకుంది.

వాళ్ళిద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదు- అప్పుడప్పుడు కృష్ణమూర్తి తో కలిసి ఇంటికి వెళ్ళినప్పుడు చూడ్డమే తప్ప-

"మాట్లాడవేం?" అన్నాడతను చనువుగా-

జవాబుగా ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది- ఆమె ఏడుపు చూడలేక కాబోలు ఆమె తల్లి దూరముగా వెళ్ళిపోయింది

సుందరానికి ఏం చెయ్యాలో తోచలేదు- ఆమెను ఎలా ఓదార్చాలో అర్థముకాలేదు బాధల్లో వున్నవాళ్ళకి సానుభూతి తెలియజెయ్యడము అతనికి అసలు చేతగాదు.

"ఏడవకు" అన్నాడు అతను.

ఇంతలో కృష్ణమూర్తి వచ్చాడు.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు కూడా చాలా సేపు శారద జాలి చూపులు అతనికి పదేపదే జ్ఞప్తికి రాసాగాయి నిద్రపోయిన తర్వాత శారద అతని కలలోకి వచ్చింది

మర్నాడు వుదయం అతనికి మెలకువ రాగానే చాలాఆశ్చర్యం కలిగింది. శారద తన కలలోకి ఎందుకొచ్చినట్లు? తనకి ఆమెపై ప్రేమవుందా? ఆ భావము అతనికి చాలా హాయిగా మధురముగా వుంది. అతని అంతరంగములో ఘర్షణ మొదలైంది.

ఒకరోజు అతను కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళాడు.

"శారదను పెళ్ళిచేసుకుంటాను. నాకు కట్నం అక్కర్లేదు"అన్నాడు

కృష్ణమూర్తి అతనివంక నివ్వెరపోయి చూశాడు. తర్వాత తేరుకున్నాడు. సంభ్రమాశ్చర్యాలతో వుక్కిరిబిక్కిరై పోయాడు. ఆనందముతో సుందరాన్ని కౌగలించుకుని-

"సుందరం నువ్వు మనిషివికాదు దేవుడివోయ్" అన్నాడు.

సుందరానికి అదోరకమైన గర్వము కలిగింది.

కొన్నేళ్ళకి కృష్ణమూర్తి తండ్రి పోయాడు. మందులఖర్చుపోయింది తల్లి చనిపోయింది, ఒకమనిషి తిండితిప్పలూ మిగిలిపోయాయి. అతనికి డిప్యూటీ తాసీల్దారు ప్రమోషన్ వచ్చింది. రాబడి పెరిగింది ఖర్చు తగ్గింది. బ్యాంక్‌లో డబ్బు పెరుగుతూవుంది అతని ఖాతాకి.

సుందరం పరిస్థితి అందుకు భిన్నముగా జరిగింది. వ్యాపారంచేస్తున్న తండ్రి పోయాడు భాగస్తుడు మోసముచేసి నష్టము చూపించాడు. తల్లి దిగులుతో మంచము ఎక్కింది. ఆస్థిఅమ్మి అప్పులు కట్టాడు సుందరం. అద్దె ఇంట్లోకి మారాడు. ఎల్.డీ.సీ నుంచి యూ.డీ.సి అయ్యాడు గాని జీవితములో పెద్దలాభము లేకపోయింది.

సుందరంపైన బడిన మరొక భారము చెల్లెలు పెళ్ళి. కమల కమలం లాగే అందగత్తె. కాని ఆమెకు పెళ్ళికావడములేదు.

కారణం కట్నం....కానుకలు....

కట్నము చాలడములేదని తిరిగిపోతున్న సంబంధాలు చూసి శారదకు బాధ కలుగుతోంది, భర్త మంచితనము ఆమెకు నాటినాటికీ గుర్తొస్తోంది ఒకప్పుడు ఆయన కష్టాల్లోవున్న తమ కుటుంబానికి మేలు చేశారు, ఇప్పుడాయన సరిగ్గా అటువంటి కష్టంలో వున్నారు. తను ఏమి చేయగలదు? శారద రాత్రింబగళ్ళు ఆలోచించి....చివరకు ఒక నిర్ణయానికి వచ్చింది.

"మనం ఒకసారి అన్నయ్యవాళ్ళ వూరు వెళదాం" అంది శారద.

"ఎందుకు?" అన్నాడు సుందరం ప్రశ్నార్థకముగా చూస్తూ

"చెప్తాను పదండి" అందామె.

సుందరం మారుమాట్లాడకుండా భార్యతో కలిసి ప్రయాణమయ్యాడు.

భార్యాభర్తలు కృష్ణమూర్తి ఇంటికెళ్ళేసరికి అతను జీప్‌లో కూర్చున్నాడు, సాయంకాలము వస్తాను" అన్నాడు.

రాత్రి ప్రొద్దుపోయి వచ్చాడు! అప్పుడు మాట్లాడ్డానికి వీల్లేకపోయింది

మర్నాడు ఉదయం ఫలహారాలు అయ్యాక సుందరం అన్నాడు భార్యతో. "మనము ఇక్కడికి ఎందుకొచ్చాం?" అని.

శారద నవ్వింది.

"కమల పెళ్ళిగురించి అన్నయ్యతో మాట్లాడదామని.

సుందరం "ఓహో"…. అన్నాడు.

హాల్లో సిగరెట్ తాగుతూ రేడియోలో పాటలు వింటూ కూర్చున్నాడు కృష్ణమూర్తి.

సుందరంవెళ్ళి అతని ఎదురు సోఫాలో అసీనుడయ్యాడు.

శారదవచ్చి "అన్నయ్యా" అంది.

రేడియో వాల్యూమ్ తగ్గించి "ఏమిటి?" అన్నట్లు చూశాడు.

"అయన ఎందుకొచ్చారో అడగవేం?" అంది.

"అడిగితే గాని చెప్పగూడదా?" అదోలా అన్నాడు కృష్ణమూర్తి. ముఖం ఎందుకోగానీ అప్రసన్నముగా వుంది

"చెప్పండి" అంది శారద.

సుందరానికి అర్థంకాలేదు.

"ఏమిటి?" అన్నాడు,

"మా తమ్ముడికి కమలను చేసుకోమని అడగండి" అంది శారద.

"నువ్వు చెప్పావుగా" పేలవంగా నవ్వాడు సుందరం.

కృష్ణమూర్తి ముఖం సీరియస్‌గా మారిపోయింది.

"మాట్లాడవేం అన్నయ్యా ?" రెట్టించింది శారద.

"ఏం మాట్లాడను?"

"గోపీకి కమలను చేసుకుంటే బాగుంటుంది కదా" అంది శారద.

"బాగానేవుంటుంది. కానీ వాడు ఇంజనీరింగ్ చదివాడు గుర్తుందా?" వెటకారముగా అన్నాడు కృష్ణమూర్తి.

"అయితే ఏం?"

"వాడిచదువుకి అప్పులు చేశాను. రేపో మాపో వాడికి ఉద్యోగము వస్తుంది, వెళ్ళిపోతాడు. వాడా అప్పులు తీరుస్తాడని నమ్మకం ఏమిటి?"

"ఐతే ..."

ఐతే ఏముంది? గోపికి బాగా కట్నం ఇస్తామని తిరుగుతున్నారు. ఆ కట్నముతో అప్పుతీర్చాలి" అంది కృష్ణమూర్తి భార్య లోపల్నుంచి వస్తూ.

ఆమె అప్పటివరకూ వాళ్ళమధ్య సంభాషణ తలుపు చాటునుంచి వింటూన్నదని శారద గ్రహించింది.

“సంబంధానికి వచ్చేటప్పుడు తాహతు చూసుకోవాలి. ఇంజనీరు చదివినవాడు గతిలేని సంబంధము చేసుకోవడానికి ఏం ఖర్మం వస్తుంది” అంది ఆమె.

కృష్ణమూర్తి రేడియో వాల్యూమ్ పెంచాడు. ఇక మీరేం చెప్పాల్సింది లేదన్నట్లుగా.

శారదకు తల కొట్టేసినట్లయింది ఆమె భర్త వంక జాలిగా చూసింది. ఒకప్పుడాయన కట్నాలు కానుకలూ కాదని తనని పెళ్ళిచేసుకున్నారు—ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా తనఅన్న కృతఘ్నుడై కట్నాలూ కానుకలూ అంటున్నాడు, సమయము వచ్చినప్పుడే మనిషి బుద్ధి బైటపడేది అనుకుందామె.

*

ప్రచురణ: ఆంధ్రభూమి, మాసపత్రిక, ఏప్రిల్ 1982